నమస్తే తెలంగాణ

# సంగారెడ్డి

I | హైదరాబాద్, ఆదివారం 8 జూన్ 2025 | SANGAREDDY




దుబ్బాక : విదేశీ పర్యటన దిగ్విజయంగా ముగించుకుని హైదరాబాద్‌కు చేరుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు శనివారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కలిసి స్వదేశీ ఆగమన శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

## రోగులకు మెరుగైన సేవలందించాలి

రామాయంపేట, జూన్ 7 : దవాఖానకు వచ్చిన రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్య సిబ్బందికి రాష్ట్ర వైద్యశాఖ క్వాలిటీ బృందం సభ్యురాలు డాక్టర్ హరిప్రియ సూచించారు. శనివారం రామాయంపేట సీహెచ్‌సీని కాయకల్ప బృందం సందర్శించింది. దవాఖానలోని ల్యాబ్, పేషెంట్ల గదులు, ఆపరేషన్ థియేటర్, గార్డెన్ తదితరాలను పరిశీలించారు. దవాఖానలో నార్మల్ డెలివరీలకు ప్రాధాన్యత ఇవ్వాలని బృందం సూచించింది. హెర్బల్ పార్కులో వివిధ రకాల ఔషధ మొక్కలు నాటడంతో అభినందించారు. అనంతరం డాక్టర్ లింబాద్రి, సుకేషిని ఆధ్వర్యంలో బృందం సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్వాలిటీ సభ్యులు రాధిక, ప్రవణ్ కుమార్‌రెడ్డి, సుష్మ, సరిత, హెడ్ నర్సు జయలక్ష్మి ఉన్నారు.



బృందాన్ని సన్మానిస్తున్న రామాయంపేట వైద్యులు డాక్టర్ లింబాద్రి తదితరులు

## ఆదర్శ రైతు వ్యవస్థను మళ్లీ తెస్తాం

**హుస్నాబాద్‌లో రైతు మహోత్సవంలో రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి**



హుస్నాబాద్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలిస్తున్న కోదండరెడ్డి తదితరులు

అక్కన్నపేట, జూన్ 7: రాష్ట్రంలో ఆదర్శ రైతు వ్యవస్థను మళ్లీ తీసుకువస్తామని రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. శనివారం హుస్నాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతు మహోత్సవం రెండో రోజు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ దృష్టికి చాలా రైతు సమస్యలు వస్తున్నాయని, కమిషన్ క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ, సమస్యలపై అధ్యయనం చేస్తూ పరిష్కార మార్గాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. త్వరలోనే 4 ఎకరాలపై ఉన్న రైతులందరికీ రైతు భరోసా నిధులు ఖాతాల్లో జమవుతాయని తెలిపారు. ఆదర్శ రైతు వ్యవస్థ, చెరువులు, కుంటల పునరుద్ధరణ, రైతులకు మట్టి నమూనా పరీక్ష పరికరాలు, ఆధునిక వ్యవసాయ యంత్రాల పంపిణీ, పండే పంటలకు అనుగుణంగా కొత్త మార్కెట్లు ఏర్పాటు, ఆధునీకరణ మార్కెట్ల వ్యవస్థ, కౌలు రైతుల విషయం లో నిర్దిష్టమైన ప్రణాళికలు, విత్తన చట్టం తదితర అంశాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలో వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చేలా కమిషన్ ప్రభుత్వానికి సిఫార్సు లు చేసినట్లు తెలిపారు. కేబినెట్ ఆమోదం తర్వా త అవి అమలు కానున్నాయన్నారు. ములుగు జిల్లాలో మల్టీనేషనల్ కంపెనీ రైతులను మోసం చేశాయని, ఈ విషయంలో కమిషన్ విచారణ చేపట్టి నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసిందన్నారు. ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని 2004 నుంచి కేంద్రానికి విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలినారు. రైతే పెద్ద శాస్త్రవేత్త, దశాబ్దాలుగా ఎవుసం చేస్తూ, ఎప్పటికప్పుడు వ్యవసాయ రంగంలో, వాతావరణంలో వచ్చే మార్పులకు అనుగుణంగా అభివృద్ధి చెందుతున్నాడని వివరించారు. సంప్రదాయ పంటల్లో పసుపు ఒక పంట అని, ఈ పసుపు ద్వారా కరోనా సమయంలో ఎందరో బతికి బయటపడ్డారని కోదండరెడ్డి అన్నారు. ఈ విషయాన్ని స్వయంగా దేశ ప్రధాని మోదీ వెల్లడించారని గుర్తు చేశారు. ఎవుసంలో పెట్టుబడి తగ్గి ఆదాయం వచ్చే పంటలు వైపు మళ్లాలని రైతులకు సూచించారు. పంట చేన్ల వద్ద కోతుల బెడద నివారించేందుకు నాబార్డు సహకారంతో సోలార్ ఫెన్సింగ్ వేసుకునేలా ఆలోచనలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం స్టాళ్లను ఆయన సందర్శించారు. కార్యక్రమంలో తెలంగాణ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, కమిషన్ సభ్యులు కేవీన్ రెడ్డి, భవానీరెడ్డి, అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, జిల్లా వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు , శాస్త్రవేతలు, రైతులు పాల్గొన్నారు.

# అర్హులకు మొండిచెయ్యి..!

- కాంగ్రెస్ కార్యకర్తలకే ఇందిరమ్మ ఇండ్లు
- పైసలిచ్చిన వారికే ఇండ్లు మంజూరు
- జిల్లాలో భారీగా చేతులు మారుతున్న డబ్బు లు
- ఇండ్ల మంజూరులో అర్హులకు అన్యాయం
- కాంగ్రెస్ నాయకుల జాబితాలు ఫైనల్ చేస్తున్న అధికారులు
- పేదలకు దూరమవుతున్న సొంతింటి కల



సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం దేవక్కపల్లిలో పూరి గుడిసెలో నివసిస్తున్న నిరుపేద ఈ కుటుంబానికి మంజూరు కాని ఇందిరమ్మ ఇల్లు

**ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో అర్హులకు అన్యాయం జరుగుతున్నది. అర్హులైన పేదలకు ఇండ్లు మంజూరు కాకపోవడంతో నిరాశ చెందుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో అవినీతి రాజ్యం మేలుతున్నది. పైసలిస్తేనే ఇందిరమ్మ ఇండ్లు మంజూరవుతున్నాయి.ఇందిరమ్మ ఇల్లు రావాలంటే కాంగ్రెస్ కార్యకర్త అయి ఉండాలి, లేదా డబ్బులైనా ముట్టజెప్పాల్సి వస్తున్నదని ఆరోపణలు ఉన్నాయి. నిరుపేదలు ఎన్ని దరఖాస్తులు చేసినా ఇల్లు మంజూరు కావడం లేదు.కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇండ్లు నిరుపేదలకు అందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.**

సిద్దిపేట, జూన్ 7( నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని దేవక్కపల్లికి గడ్డం కిష్టయ్య నిరుపేద. వీరికి ఉండడానికి ఇల్లు లేదు.దళితులకు ఇచ్చిన కొద్దిపాటి స్థలంలో గుడిసె వేసుకొని నివాసం ఉంటున్నారు. కుటుంబ సభ్యులు కూలీపని చేస్తేనే పొట్ట గడుస్తుంది.పూరి గుడిసెలో ఉంటున్న అతను అందరిలాగానే ఇందిరమ్మ ఇంటి కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నాడు. కానీ, ఇతనికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదు. అర్హుడిని అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని గడ్డం కిష్టయ్య దీనంగా ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాడు. ఇదే దేవక్కపల్లిలో ఓ కాంగ్రెస్ కార్యకర్తకు రెండు ఇండ్లు ఉన్నాయి. మూడెకరాలకు పైగా భూమి ఉంది. ట్రాక్టర్ ఉంది. ఇతను కాంగ్రెస్ కార్యకర్త కావడంతో ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఇలాంటి వారికి ఇల్లు మంజూరు చేసి, అదే గుంట భూమి లేని వారికి ఈ గ్రామంలో ఇల్లు మంజూరు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులకు మొండిచేయి చూపిస్తున్నది అనడానికి ఇదే నిదర్శనం. అనర్హులకు అందలం ఎక్కిస్తున్నారు. ఇవి జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు జాబితాలో జరుగుతున్న కొన్ని ఉదాహరణలు మాత్రమే. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కాంగ్రెస్ కార్యకర్తలకే ఇందిరమ్మ ఇండ్లు కేటాయించారు.పేరుకే గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేశారు.కా,నీ అంతా కాంగ్రెస్ నాయకులు రాసిచ్చిన పేర్లు ఫైనల్ అవుతున్నాయి. నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు అందడం లేదు. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలో ఓ నిరుపేద ఇల్లు మంజూరు చేయమని కాంగ్రెస్ నాయకుడి వద్దకు వెళ్తే, ఉన్న ఇల్లు కూలగొట్టుకొని రూ. 50 వేలు తీసుకొని రావాలని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానని బాహాటంగా చెప్పాడు. చేర్యాల మండలంలోనూ ఇలాగే జరిగింది. ఇలా డబ్బులు ఇస్తే వారి పేర్లు ఇందిరమ ఇండ్ల జాబితాలో చేర్చుతున్నారు. అధికారులు కూడా స్థానిక కాంగ్రెస్ నాయకులు ఏ జాబితా ఇస్తే అదే జాబితాను ఆమోదించి ఇండ్లు మంజూరు చేస్తున్నారు. దీంతో అర్హులైన పేదలకు అన్యాయం జరుగుతున్నది.

### ఆశలు వదులుకుంటున్న నిరుపేదలు

కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని ఆశపడ్డ నిరుపేదలకు పరిస్థితులు చూసి నిరాశ చెందుతున్నారు. సొంతింటి కలను సాకారం చేసుకుందామంటే కాంగ్రెస్ ప్రభుత్వంలో సాధ్యమయ్యేలా లేదని పేదలు నిట్టూరుస్తున్నారు. పైసలు లేనిదే పనులు కావడం లేదంటున్నారు. తొలుతనే డబ్బులు గుంజుతున్న నాయకులు ఇల్లు పూర్తి అయ్యేసరికి ఎన్ని డబ్బులు గుంజుతారోనని పేదలు జంకుతున్నారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసే విషయంతో ప్రభుత్వం స్పష్టమైన విధివిధానాలు రూపొందించక పోవడంతో ఇప్పుడు లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు.తొలుత అందరికీ ఇందిరమ్మ ఇండ్లు అని చెప్పిన ప్రభుత్వం, ఇప్పుడు నిబంధనలు మార్చింది.ప్రభుత్వం చెప్పిన మాటలతో ఉన్న ఫలంగా ఇంటిని కూలగొట్టి, దాని అడుగులోనే ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గులు పోసుకున్నారు చాలామంది.కొంత మంది బేస్‌మెంట్ లెవల్ వరకు పూర్తి చేసుకున్నారు. తీరా ప్రభుత్వం నిబంధనలు మార్చింది.ప్రతి ఇంటి నిర్మాణం 400 నుంచి 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండాలని ఆదేశించింది. ప్రభుత్వం తాజాగా విధించిన నిబంధనలతో చాలా మంది ఇండ్లు రద్దు అవుతున్నాయి. పైగా ఆ విస్తీర్ణంలో ఇంటి నిర్మాణం వద్దని లబ్ధిదారులు విరమించుకుంటున్నారు. ప్రతి లబ్ధిదారుడు 600 చదరపు అడుగుల విస్తీర్ణం లోపలనే ఇంటి నిర్మాణం చేసుకుంటేనే బిల్లులు ఇస్తామని అధికారులు చెబుతున్నారు.దీంతో ఇల్లు కట్టడానికి వెనుకా ముందు ఆలోచిస్తున్నారు. పైగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణం చేసుకుంటామని ప్రమాణ పత్రం రాసి ఇవ్వాల్సి వస్తున్నది. పనికి మాలిన నిబంధనలు పెట్టి తమతో ప్రభుత్వం ఆడుకుంటున్నదని లబ్ధిదారులు మండిపడుతున్నారు.

# ప్రభుత్వ భూములు మాయం

- అమీన్‌పూర్‌లో సర్కారు భూములను మింగేస్తున్న గద్దలు
- ప్లాట్లుగా చేసి విక్రయాలు
- ప్రభుత్వ భూముల కబ్జాపై ఫిర్యాదుతో లోకాయుక్త విచారణ
- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో విచ్చలవిడిగా ఇండ్ల నిర్మాణాలు
- శెట్టికుంట, ఊబకుంట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఇటీవల ఇండ్ల కూల్చివేత
- ఎఫ్‌టీఎల్ పరిధిలో ఇండ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలేవీ..?



అమీన్‌పూర్ మండల పరిధిలోని శెట్టికుంట ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణం చేసిన ఇండ్లను జేసీబీలతో కూల్చివేస్తున్న అధికారులు(ఫైల్ )

పటాన్‌చెరు, జూన్ 7 : సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పరిధిలో విలువైన సర్కారు భూములు ఆక్రమణలకు గురవుతున్నాయి. ఎఫ్‌టీఎల్,బఫర్ జోన్, అసైన్డ్ భూముల్లో దర్జాగా నిర్మాణాలు జరుగుతున్నాయి. డబ్బులు తీసుకుని రెవెన్యూ, నీటిపారుదల, గ్రామ పంచాయతీ అధికారులు అనుమతులు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ భూములు ఆక్రమించి కొందరు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా అటువైపు రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, పంచాయతీ అధికారులు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. గ్రామస్తులు, కాలనీ వాసులు ఫిర్యాదులు చేయడంతో అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. తూతూమంత్రంగా అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తున్నారు. భూముల ధరలు పెరిగిపోవడంతో రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారుల అండతో ఎఫ్‌టీఎల్,బఫర్ జోన్, అసైన్డ్ భూములను కొందరు చెరబట్టి స్థలాలుగా చేసి విక్రయించిన సంఘటనలు ఈ ప్రాంతంలో వెలుగు చూస్తున్నాయి. స్థలాలు కొనుగోలు చేసిన వారు భవనాలు నిర్మాణం చేసిన తర్వాత కొందరు ఫిర్యాదులు చేయడంతో విచారణ చేసి అధికారులు కూల్చివేతలు చేస్తున్నారు. డబ్బులు ఇచ్చిన వారి భవనాలను అధికారులు కూల్చివేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అక్రమంగా ప్లాట్లు చేసి అమ్మకాలు చేసిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని అధికారులను ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో బీరంగూడ, కృష్టారెడ్డిపేట, ఐలాపూర్‌లో కోట్లాది రూపాయల విలువ చేసే భూములు కబ్జాలకు గురవుతున్నాయి.

### అనుమతులు ఎవరిచ్చారు...?

అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో అక్రమ నిర్మాణాలకు మున్సిపల్ అధికారులు ఎలా అనుమతి ఇచ్చారని పలువురు ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ పరిధిలోని శెట్టికుంట, ఊబకుంట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ప్లాట్లు ఎవరు విక్రయించారు..? ప్లాట్లలో ఇంటి నిర్మాణం చేసేందుకు అనుమతులు ఎవరు ఇచ్చారో జిల్లా అధికారులు విచారణ చేపట్టాలనే డిమాండ్లు ఉన్నాయి. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని సర్వేనంబర్ 947లో అక్రమంగా ఇంటి నిర్మాణాలు చేసినా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదు. తీరా ఇంటి నిర్మాణాలు పూర్తిచేసిన తర్వాత అధికారులు తూతూమంత్రంగా కూల్చివేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అమీన్‌పూర్‌లోని ప్రభుత్వ భూములు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి అక్రమంగా ప్లాట్లు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇంటి నిర్మాణల కోసం మున్సిపల్ అధికారులు ఎలా అనుమతులు ఇస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు ప్రభుత్వ భూముల్లో నిర్మాణం చేసిన ఇండ్లకు కరెంట్ మీటర్లు ఇచ్చారు. అధికారుల అండదండలతోనే ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయని, ఇండ్ల నిర్మాణానికి అనుమతులు లభిస్తున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.


### అమీన్‌పూర్‌లో ప్రభుత్వ భూములు కబ్జా ?

అమీన్‌పూర్‌లో వేల ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. హైదరాబాద్‌కు సమీపంలో ఉండడంతో ఈ ప్రాంతం అభివృద్ధి వైపు పరుగులు పెడుతున్నది. ఇటీవల పలు గ్రామాలను అమీన్‌పూర్ మున్సిపల్‌లో ప్రభుత్వం కల్పింది. సర్వే నంబరు 32, 630, 947, 993, 1000, 1112లో ఉన్న ప్రభుత్వ భూములను కొందరు బడాబాబులు ఆక్రమించి ప్లాట్లు వేసి ఇంటి నిర్మాణాలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, మున్సిపల్, నీటిపారుదల శాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే ప్రశ్నలు వస్తున్నాయి. మే 30న సర్వేనంబర్ 947లో అక్రమంగా శెట్టికుంట, ఊబకుంట చెరువులో నిర్మాణం చేసిన ఇండ్లను అధికారులు కూల్చివేశారు. మే 28న సర్వే నంబరులో 1000లో ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించారని గ్రామస్తులు లోకాయుక్తాకు ఫిర్యాదు చేయడంతో అధికారులు భూములు పరిశీలించారు. 18.11 ఎకరాల భూమి ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 16.28 ఎకరాలు ఉంది. 2 ఎకరాల భూమి కబ్జాకు గురైంది. 1000 సర్వే నంబరులో రెవెన్యూ అధికారులు, సర్వే అధికారులు అక్రమాలకు పాల్పడి రియల్ వ్యాపారులకు అప్పగించారనే ఆరోపణలు ఉన్నాయి. అమీన్‌పూర్‌లో ఎకరం భూమి విలువ కోట్లాది రూపాయలు పలుకుతున్నది. దీంతో రియల్ వ్యాపారులు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు కలసి భూములను మాయం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇందులో రెవెన్యూ అధికారుల పాత్ర ప్రముఖంగా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో పనిచేసిన కొందరు రెవెన్యూ అధికారులు వారి బంధువులు, స్నేహితుల పేరుతో ప్రభుత్వ భూముల్లో ప్లాట్ల ధ్రువీకరణ పత్రాలు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సమగ్ర విచారణ, పూర్తిస్థాయిలో సర్వేచేసి ప్రభుత్వ భూములను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



అమీన్‌పూర్ మండలంలోని ప్రభుత్వ సర్వే నంబర్ 1000లో ఉన్న భూమిని కబ్జా చేశారని ప్రజలు ఫిర్యాదు చేయడంతో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న లోకా యుక్త అధికారులు (ఫైల్ )



హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం కాళేశ్వరం ప్రాజెక్టు గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తున్న మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు



హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు కాళేశ్వరం ప్రాజెక్టు పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను వీక్షిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, ప్రముఖులు



అంధకారమయంగా బొల్లారం పారిశ్రామిక వాడ రోడ్డు

### అంధకారమయంగా బొల్లారం పారిశ్రామిక వాడ

జిన్నారం, జూన్ 7 : సంగారెడ్డి జిల్లాలోని బొల్లారం పారిశ్రామిక వాడ అంధకారమయంగా మారింది. పారిశ్రామికవాడలో కొన్ని నెలలుగా వీధి దీపాలు వెలగక చిమ్మ చీకట్లు కమ్ముకున్నాయి. దీంతో పరిశ్రమల్లో పనులకు వెళ్లే మహిళలు, యువతీ యువకులు ఇబ్బందులకు గురవుతున్నారు. వీధి దీపాల నిర్వహణలో మున్సిపల్ అధికారులు విఫలమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రయితే అంధకారంతో ప్రమాదాలు చోటు చేసు కుంటున్నాయని, భయాందోళగా ఉందని స్థానికులు, కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశ్రామిక వాడ లో వీధి దీపాల సమస్యను తక్షణమే పరిష్కరించాలని స్థానికులు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.

## చినుకు పడితే చిత్తడే

- వంగపల్లి-ఉప్పరోనిగడ్డల మధ్య అధ్వానంగా రోడ్డు
- రోడ్డుపై ప్రయాణించేందుకు వాహన చోదకులు అవస్థలు

మద్దూరు, జూన్ 7: సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలోని వంగపల్లి-ఉప్పరోనిగడ్డల మధ్యగల మట్టి రోడ్డు అధ్వానంగా మారిం ది. చిన్నపాటి వర్షం పడితేనే ఈ మట్టి రోడ్డు బురదమయంగా మారుతున్నది. రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో ప్రయాణించేందుకు వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రివేళ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రోడ్డుపై ప్రయాణిస్తున్నారు. సిద్దిపేట-జనగామ జిల్లాలకు సరిహద్దుగా ఉన్న ఈ రోడ్డుపై నిత్యం వందల సంఖ్యలో ప్రజలు ప్రయాణం చేస్తుంటారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రోడ్డు మరమ్మతులకు రూ. 5లక్షల నిధులు మంజూరు చేసింది. అదే సమయంలో ప్రభుత్వం మారడంతో రోడ్డు మరమ్మతుల పనులు అటకెక్కాయి. రోడ్డు మరమ్మతులను ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పూర్తిగా దెబ్బతింటున్నది. మట్టి రోడ్డు స్థానంలో బీటీ రోడ్డు నిర్మిస్తే తమ ఇబ్బందులు తొలుగుతాయని వంగపల్లి, ఉప్పరోనిగడ్డ గ్రామస్తులు కోరుతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బీటీ రోడ్డు నిర్మించాలని వేడుకుంటున్నారు.



బురదమయంగా వంగపల్లి-ఉప్పరోనిగడ్డ మట్టి రోడ్డు